


# కీర్తి కిరీటాలు

## నవలారాణి నవలల నేపథ్యం



నాయీ నవలకి, 'కీర్తికిరీటాలు' అన్న పేరు పెట్టాలని నాకెందుకు అనిపించిందో ఇప్పటికీ నాకు తెలియదు. ఒక్కోసారి టైటిల్స్ ఫ్లాష్‌లా వచ్చేస్తాయి. అంతే. కీర్తికిరీటాలు అనే మాట కొత్త ప్రయోగం అని కొంతమంది అన్నారు. ఇది విమర్శకులకి కూడా వచ్చిన నవల.

ఒకసారి రవీంద్రభారతిలో పద్దెనిమిది సంవత్సరాల వయసుగల అమ్మాయి చేస్తున్న డాన్స్ ప్రోగ్రామ్ చూసాను. ఆమె తొలి యవ్వనపు కాంతులతో చాలా అందంగా ఉంది. అద్భుతమైన భావ విన్యాసాలు చూపించింది. ఇంత చిన్న వయసులో అంత ప్రతిభ చూపిస్తున్న ఈ అమ్మాయి భవిష్యత్తులో ఒక గొప్ప కళాకారిణి తప్పక అవుతుంది, ఆమెకి ఉజ్వల భవిష్యత్తు ఉంది అని నమ్మాను నేను. కాని నాలుగేళ్ళ తర్వాత ఆ అమ్మాయి తెలిసిన ఒక బంధువు చాలా విషాదమైన వార్త చెప్పాడు. ఆ అమ్మాయి డాన్స్ నేర్పించే అతని ప్రేమలోపడి, పెళ్ళి చేసుకుందిట. ఇద్దరు పిల్లలు. ఇల్లు - సంసారం గొడవలో పడింది. భర్త ఆమె డాన్స్ చేయడానికి వీల్లేదని షరతు పెడితే, ఆ లక్ష్మణరేఖ దాటలేదట. ఆయన వెళ్ళిపోయిన తర్వాత కూడా నేను ఆ అమ్మాయి గురించే ఆలోచించాను. ఆమెలో ఉన్న అసాధారణమైన ప్రతిభ మొగ్గలోనే తుంచివేయబడింది. ఆ అమ్మాయేకాదు, నా చుట్టూవున్న చాలామందిలో ముఖ్యంగా స్త్రీలు ఏవో ప్రతిభలు ఉన్నా, అవి సంసారబంధం ఇరుసుల క్రిదపడి నలిగి, రెక్కలు తెగిన పువ్వులు అవటం నేను గమనిస్తూనే ఉన్నాను.

నాకు ఎప్పుడూ డాన్స్ హఠాత్తుగా మానేసిన ఆ అమ్మాయే గుర్తుకు వస్తూ ఉండేది. ఒక విధంగా నన్ను ఆమె వెంటాడింది. ఆమె జీవితంలో ఎక్కడో తప్పు జరిగిపోయింది అనిపించేది.

ఇది జరిగిన చాలా రోజుల తర్వాత నేను నా రచనా వృత్తిలో పడి మెల్లగా ఆ డాన్సర్‌ని మర్చిపోవటం మొదలు పెట్టాను.

ఒకరోజు మధ్యాహ్నం - మా పెద్దన్నయ్యకి తెలిసిన సీత అనే ఒకావిడ వచ్చింది. వచ్చిన తర్వాత మాటల సందర్భంగా ఆవిడ జీవితం గురించి చెప్పింది. ఆమె ప్రతిభ గల డాన్సర్. పేరు - డబ్బు - చిన్నతనంలోనే స్వంతం అయినాయి. ఆమె ఒకతని ప్రేమలో పడింది. అతను మోసగాడు అని తెలిసింది. భరించలేకపోయింది. ఆత్మహత్య చేసుకోవటానికి వెళ్ళి రైలు క్రింద తలపెట్టబోయింది. ఎవరో లాగి రక్షించారు. కానీ ఆమె కాలు మీదనుంచీ రైలు చక్రం వెళ్ళింది. కుంటిదయింది. ఇది ఇంకా నరకం. ఆమె గురువుగారు ఆమెని సేదదీర్చారు. జైపూర్ కాలు అమర్చారు, నడవగలుతోంది. అనారోగ్యంతో మంచంలో ఉండటం వల్ల లావు అయిపోయింది.

బాధలతో నలిగిపోవటంతో ముఖంలో కళ మాసింది. ఆర్థికమైన ఇబ్బందులు. ఎవ్వరూ సాయం చేయలేదు. ఒకళ్ళిద్దరు పిల్లలకి డాన్స్ నేర్పిస్తూ జీవితం కష్టం మీద లాగుతోంది. అప్పటికి ఆమెకి 32 సంవత్సరాలు ఉంటాయేమో.

ఈమె వెళ్ళిపోయిన తర్వాత, ఈమె జీవితం కూడా నన్ను కదిలించింది. కీర్తికిరీటాల్లో హీరోయిన్ సువర్ణలత ప్రాణం పోసుకుంది. ఈ నవల కూడా స్వాతి మంత్లీలో వచ్చింది. అందిరికీ ఇప్పటికీ కూడా నచ్చే నవలల్లో ఇది ఒకటి.

"కీర్తికిరీటాలు" అని పేరు పెట్టడంలో గ్లామర్ కంటే, నా ఉద్దేశ్యంలో దాని వెనుక బాధే ఉంది. ఏదో ఒక ప్రతిభతో కళాకారుడు పాపులర్ అవుతాడు. గ్లామర్ వస్తుంది. అభిమానులు పెరుగుతారు. మొదట్లో ఈ అభిమానం చాలా సంతోషంగా ఉంటుంది. తర్వాత - తర్వాత అభిమానుల డిమాండ్ చాలా పెరిగిపోతుంది. ఇంకా - ఇంకా కొత్త ఆనందాలు వారి మనసుల్ని జలపాతంలో తడిపేసేవి కావాలంటారు. ఇక్కడ నుంచీ కళాకారుడికి కష్టం, ఆవేదన మొదలు అవుతాయి. తనని అభిమానించి దగ్గరికి వచ్చినవారు, తననెత్తిన ఎక్కి డిమాండ్స్ పెంచడంతో వారికోర్కెలకి సరితూగలేక కళాకారుడు డిప్రెషన్‌కి గురి అవుతాడు. కళాకారులకి, అభిమానులకి మధ్య ఇంత అంతర్యుద్ధం ఉంది. అందుకే కళాకారుడెప్పుడూ పదిమంది పొగిడితే, 'నేను చాలా గొప్పవాడిని' అని విర్రవీగకూడదు. అహం పెంచుకోకూడదు. అది అతని పతనానికి, అశాంతికి నాంది అవుతుంది. నేను ఎప్పుడూ ఈ కీర్తిప్రతిష్ఠల పట్ల డిటాచ్‌మెంట్‌తోనే ఉన్నాను.



నేను ఆరాధించే చాలా కొద్దిమంది వ్యక్తుల్లో లతా మంగేష్కర్ ఒకరు. ఆమె పెళ్ళి చేసుకోకపోవటం నాకెందుకో చాలా సంతోషంగా అనిపించేది. లలిత కళల్లో గానం, నాట్యం, రచన వీటిల్లో అసాధారణమైన ప్రతిభ ఉన్నవాళ్ళు. ఈ సంసారబంధాల చిక్కుముడుల్లో ఇరుక్కోకూడదు అని నా అభిప్రాయం. ఎందుకంటే సంసారం అంటే పెద్ద బాధ్యత. ఒకసారి ఆ పరిధిలోకి అడుగుపెడితే, ఆ వ్యక్తి దాని ఒక్కదానికే ప్రాధాన్యత ఇవ్వాలి. తనని తాను ద్వితీయ శ్రేణి వ్యక్తిత్వంగా భావించుకోవాలి. జీవితంలో మనిషిని సంసారబంధం అంతసారం లాక్కుంటుంది. ఆర్టిస్టులకి ఇలాటి బంధాలు కుదరవు. వారికి భగవంతుడు జన్మతః ఇచ్చిన నైపుణ్యం అది.

అంతేకాదు ప్రతిభగల ఏ కళాకారుడు అయినా, తిండికీ, నీడకీ, సంపాదన కోసం తన శ్రమ మీద తాను ఆధారపడకూడదు. డబ్బు సంపాదన బాధ్యతలో పడిన కళాకారుడు, తనలోని సృజనాత్మకతకి న్యాయం చేయలేదు. కళాకారుడికి తనలోని కళని ప్రదర్శించటం అనేది ఒక తపస్సు. అతనికి డబ్బు సంపాదన అవసరంలేదు. బిరుదులు అఖ్ఖర్లేదు. పొగడ్తలు అసలే అవసరం లేదు. అతనిలోని కళని వ్యక్తీకరించుకోవటమే అతని ధ్యాస. అందులోనే అతనికి ఆత్మానందం. అతని కళసాటి ప్రజలకి ఆనందం కలిగిస్తే అమ్మ ముందు వెన్నముద్దలు తినే చిన్నపిల్లవాడిలా స్తంతోషపడిపోతాడు.

పూర్వకాలంలో రాజులు శిల్పులకి, చిత్రకారులకి సంవత్సరాల తరబడి తమ నైపుణ్యం ప్రదర్శించి చరిత్రలో అద్భుతమైన 'సంస్కృతీ వారసత్వం' ఇవ్వగలిగేట్టు కృషిచేసే వారి మంచి చెడులు చూసే బాధ్యత రాజే తండ్రిలా చూసుకునేవాడు. అందుకే దేవాలయాల మీద శిల్పాలు చెక్కటానికి సంవత్సరాలు పట్టేవి. ఆ కళ తండ్రి నుంచీ కొడుకుకి వచ్చి తరం మారినా, ఆ శిల్ప సంపదని వృద్ధి చేసే రెండో తరం వచ్చేది.

ఈనాడు కళాకారులంటే ఎవ్వరికీ పట్టదు. అతని ప్రతిభ ప్రదర్శిస్తే అది ఆనందించి చేతులు దులుపుకుని వెళ్ళిపోయే వాళ్ళే తప్ప అతని ఆలనా, పాలనా చూసే వాళ్ళే లేరు. ఎంతో మంది కళాకారులు, వృద్ధాప్యంలో సరైన తిండి దొరక్క ఆకలితో అలమటించే పరిస్థితులు ఉన్నాయి. కళాకారులు వ్యాపారవేత్తలు అవలేరు. డబ్బు సంపాదన నెపంతో, సంఘాన్ని దోచుకునే సామర్థ్యం వాళ్ళకి ఉండదు.

సున్నితమనస్కులు. కాస్త అగౌరవానికే కళ్ళలో చివ్వున నీళ్ళు తిరుగుతాయి. ఎంత ఆకలిగా ఉన్నా ఎవరి ముందూ చేయిజాచలేరు. కళాకారుని మంచి చెడ్డలు చూడాల్సిన బాధ్యత ఈ సంఘంలో ప్రతి ఒక్కరిదీ. ఎందుకంటే పాములు నిచ్చెన లాటి డబ్బు సంపాదనతో సంసార బాధ్యతల ఇనుప ముళ్ళ మధ్య బ్రతికే మీకు మనసుకి శాంతి, ఆనందం ఇచ్చేది కళ ఒక్కటే.

'కీర్తికిరీటాలు' పేరు అందరికీ నచ్చటమే కాదు, అది నాకు ఒక పెద్ద 'కీర్తికిరీటం' అయింది.

క్రిందటి సంవత్సరం శ్రావణమాసంలో ఒక సాఫ్ట్వేర్ ఇంజినీర్గా పనిచేస్తున్న అమ్మాయి శ్రావణమంగళవారం నోము నోచుకుని శనగలు వాయినం ఇవ్వటానికి వచ్చింది. నేను ఆమె ఉద్యోగం విని 'నువ్వు ఈ నోములు నోస్తున్నావా?' అన్నాను ఆశ్చర్యంగా.

"ఏం? నోయకూడదాండీ, చదువుకుంటే మన కల్చర్ వదిలేసుకోవాలా? " అంది నన్ను నిలదీస్తున్నట్టుగా, నేను జవాబు చెప్పలేకపోయాను. ఈమె జీన్స్ - షర్ట్తో ఆఫీసుకి వెళుతూ చాలాసార్లు ఎదురైంది. పట్టుచీరతో, కుంకుమ బొట్టు పెద్దగా పెట్టుకుని, చేతులనిండా గోరింటాకు, గాజులతో వచ్చింది.

'నీ పేరేమిటమ్మా?" అన్నాను.

ఈ మాట వినగానే ఆ అమ్మాయి ముఖం  మాడ్చుకుంది, 'సువర్ణలత' అంది.

'మంచి పేరు' అన్నాను.

'మీ నవలల్లో పేరట కదా! మా అమ్మకి మీరంటే నాలా ఇష్టం. నాకు తెలుగు రాదు. మా అమ్మ మీ నవలలు చెబుతూ ఉంటుంది. ఆవిడ ఇష్టపడితే పడింది. నాకు ఈ పేరు, మా అన్నయ్యకి రాజశేఖరం అని పెట్టింది. బోరు పేర్లు. మాకు మా పేర్లు అస్సలు నచ్చలేదు. హాయిగా రేష్మీ అనీ, నవ్య అనో, పంకజ్, మనోజ్ అనో మీరెందుకు మా కథల్లో పేర్లు పెట్టలేదండీ,' అంది. నేను హతూశురాలినయాను. ఆ అమ్మాయి వెళ్ళి పోయిం తర్వాత, ఆ అమ్మాయి మాడ్చుకున్న ముఖమే గుర్తుకు వచ్చింది. నవ్వు వచ్చింది. పాపం! వాళ్ళ అమ్మ ఇష్టానికి తను, అన్నయ్య బలి అయినట్టు మాట్లాడింది.

ఇలా నవలల్లో పేర్లు తమ పిల్లలకి పెట్టుకున్న అభిమాన పాఠకులు నా జీవితంలో చాలా మంది ఎదురయారు. అందుకే అంటాను. మన అభిమానం ఎదుటవారిని బాధించకూడదు అని.

WWW.IWOMAN.IN

ORDINARY WOMAN EXTRAORDINARY POWER

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి గారు YSSR ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థని స్థాపించి అనేక సామాజిక సేవా కార్యక్రమాలని నిర్వహిస్తున్నారు. హైదరాబాదులోనే, ప్రపంచవ్యాప్తంగానూ వున్న అనేకమంది ప్రముఖులు ఈ సంస్థ సేవాకార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. ఈ సంస్థ తరఫున వీధి బాలలసంక్షేమ కార్యక్రమాలూ, వృద్ధుల సంక్షేమకార్యక్రమాలూ, అంగవికలులకు వైద్య సదుపాయాలూ, స్వయం ఉపాధి పథకాల రూపకల్పన, వాటిని అమలుచేయడం లాంటి అనేక కార్యక్రమాలని స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ కార్యక్రమాల వివరాలకోసం, సేవాకార్యక్రమాల సమగ్రసమాచారంకోసం HTTP://WWW.IWOMAN.IN *(CLICK HERE TO GO THERE)* వెబ్ సైట్‌ని సందర్శించండి. ఈ సంస్థ సేవాకార్యక్రమాల్లో పాల్గొనదలచిన వారు 'కౌముది' ని కానీ, నేరుగా శ్రీమతి యద్దనపూడి గారిని కానీ సంప్రదించ వలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

ఎడిటర్

కౌముది